# దర్గామిట్ట కతలు

## మా నాయిన 'ట్రిక్కు' నేర్పని కత!

మా యింటి ముందర యిస్కూటరాగి పీప్ పీప్‌మంటా రెండుసార్లు హారను మోగిచ్చిందంటే నల్లెంకారెడ్డి వచ్చినట్టే లెక్క.

నల్లెంకారెడ్డి (నల్ల + వెంకారెడ్డి) ఎప్పుడొచ్చినా యిస్కూటరికి స్టాండేసి యింట్లోకి రాడు. బయట్నే హారను కొట్టి పిలస్తాడు మా నాయిన్ని.

'మోటారులో నీళ్లు రావడంలా కరీంభాయ్! రొంతొచ్చి చూడవా? అర్జెంట్' అన్నాడు, హారను శబ్దానికి మా నాయిన బయిటికి రాంగానే.

ఎవురైనా పని చెప్పిన ఎమ్మట్నే స్క్రూడ్రైవరూ కటింగ్ ప్లేరూ ఎత్తుకొని పరిగెత్తే రకం కాదుగదా మా నాయిన. అందుకని 'ఎందుకనా?' అని అడిగినాడు నిమ్మళంగా.

'అదే తెలియడంలా కరీంభాయ్. సుచ్చేస్తే గిర్రమని సౌండ్ వస్తా ఉంది గానీ లోపల మోటారు తిరగతా ఉందో లేదో అర్దం గావడంలా. ఎమ్మట్నే ఎల్లి చూడవా. ఒకేళ వైండింగు కాలి పొయ్యుంటే మార్చే పని మొదులుబెట్టేద్దూగాని. ఎంతయితే అంతిచ్చేస్తా' అన్నాడు నల్లెంకారెడ్డి.

మా నాయిన ఒక్క నిమిట్టు ఆలోచించి 'అట్టాగేలే. చూస్తా' అన్నాడు.

'పొలుమారకుండా ఎమ్మట్నే ఎళ్లు. ఏ సంగతీ హాలుకాడికొచ్చి చెప్పు. అవతల ఇంటర్‌బెల్‌కి టైమవతా ఉంది' అంటా ఇస్కూటర్ స్టార్ట్ చేసి ఎల్లిపోయినాడు నల్లెంకారెడ్డి.

నల్లెంకారెడ్డి మా నాయినకు చాలాకాలంగా తెలుసు. ఆయనింటి పేరు ఏందోగాని మనిషి నల్లగా ఉండేసరికి మాకాయన 'నల్లెంకారెడ్డి' అయినాడు. ఆయన ఒకప్పుడు బాగా బీదరికం అనుబవించినాడంట గానీ ఎంకటేశ్వరా హాలులో క్యాంటీను లీజుకు తీసుకున్నాక దేవుడి దయవల్ల కలిసొచ్చింది. మా యింటికి దెగ్గిరగా పెద్ద ఇల్లు కట్టినాడు. రొంత ఎనకేసినాడు. ఆ యింటికి వైరింగు చేసినంత కాలం రోజూ మా యింటి ముందర స్కూటరాపతా ఉండేవాడు నల్లెంకారెడ్డి.

డబ్బుకు పర్వాలేని నల్లెంకారెడ్డి లాంటి మనిషికాడ వైరింగుపనికి, మోటారు పనికి ఎంతంటే అంత తీసుకోవచ్చుగా మా నాయిన? అట్ట చేయడు. ఎట్ట చేస్తాడో చూడండి.

కాసేపు తాలినాక 'రే...రొంత తోడు రారా' అంటా నా చేతిలో సామాన్ల బుట్ట పెట్టి నల్లెంకారెడ్డి యింటికి బయల్దేరినాడు మా నాయిన.

బావి గట్టునే బిగించి ఉంది నీళ్ల మోటారు. దాని దగ్గరికెల్లి, పసిబిడ్డ పొట్టనొక్కి చూసే డాక్టరుమాదిరిగా కాసేపు అటూ ఇటూ తట్టి సుచ్చేసినాడు మా నాయిన. 'గుయ్'మంటా సౌండు అదిరిపోయింది. తేడాగా వున్న ఆ సౌండు యినంగానే ప్రాబ్లమేందో అర్దమైపోయింది మా నాయినకి.

అంతే. రెండే రెండు నిమిషాల్లో మోటారిప్పి రెండే రెండు నిమిషాల్లో రిపేరుపని పూర్తి చేసినాడు. మోటారు బిగించి మల్లీ సుచ్చేయగానే జలజలమంటా నీళ్లొచ్చి తొట్టిలో పడినాయి.

'యింకసా' అన్నాడు మా నాయిన, ఆ నీళ్లల్లోనే చేతులు కడుక్కుంటా.

నాకు బలే బాదయిపోయింది. నిజ్జానికి ఆ మోటారుని విప్పి, మా అంగడికి తీసకెల్లి, అంతా బాగానే వున్నా వైండింగు కాలిపోయిందని అబద్దం




చెప్పవచ్చు మా నాయిన. వైండింగ్ వైరు కొనాలని చెప్పి ఎగస్ట్రాగా మూడు వందలు అడిగి తీసుకోమండొచ్చు. కొత్తగా వైండింగు చేసినట్టుగా యాక్షను చేసి మల్లీ అదే మోటారును అట్నే బిగించి యింకో వంద రూపాయలు చార్జీ చేసుండొచ్చు. మామూలోళ్లకి తెలియని పని కదా. ఎట్ట చెప్తే అట్ట విని ఎంత చెప్తే అంత యిస్తారు. నల్లెంకారెడ్డయితే అన్ని వందలడిగినా కళ్లు మూసుకొని యిచ్చేస్తాడు.

కానీ మా నాయిన అట్టా చేయకుండా అదే దోవన ఎంకటేశ్వర హాలు కాడికి తీసుకెల్లాడు నన్ను.

'ఏం కరీం భాయ్? నీళ్లొచ్చినాయా?' అన్నాడు నల్లెంకారెడ్డి, మమ్మల్ని చూస్తానే.

'రాక నస్తాయా?' అన్నాడు మా నాయిన నవ్వతా.

'పోనీలే. బాద తప్పింది. ఎంతిమ్మంటావా?' అన్నాడు క్యాంటీను గల్లాపెట్టె లోనుంచి వదులు, యిరవైలు తీస్తా.

'ఆ సంబడం పనికి డబ్బులెందుకులే గానీ మంచి స్ట్రాంగుగా టీ ఒకటేసి. యీడికి కావాలంటే రెండు పులిబంగరాలు పెట్టివ్వు' అన్నాడు మా నాయిన.

మా నాయినకు టీ. నాకు పులి బంగరాలు. అదీ మా నాయిన సంపాదన.

యిప్పట్నించే కాదు. ముందు నుంచీ కూడా మా నాయిన నాటమే అంత. చేసిన పనికి ఒక్క నయాపైసా ఎక్కువ తీసుకోడు. ఎక్కువ తీసుకోబట్లేదు గాని కరెక్టుగా అయినా తీసుకోవాలి గదా. అదీలా.

మా కావలికి చుట్టుపక్కల జలదంకి, సిరివురం, అల్లూరు, మద్దూరుపాడు లాంటి పల్లెటూర్లుండాయి. ఆ వూర్ల రైతులు పొద్దున్నే మా యింటికొచ్చి, టీలు తాగే అలవాటు లాకున్నా, మా నాయిన నిద్ర లేచేదాకా సుందరయ్య బొంకుకాడ టీలు తాగతా కూచుంటారు.

మా నాయిన లేచినాక దగ్గరుండి పొలాల్లో నీళ్ల

మోటర్ల రిపేర్లకి పిలచక పోతారు. పాపం వాళ్లు బలే అమాయకులు గదా. కరెంటు పనిలో ఏమి మోసం చేసినా వాళ్లకు అర్థం కాదు.

అయినా గానీ 'చ! కష్టం చేసుకునే వాళ్ల సొమ్ము మనకు బళ్లా' అంటా నయాపైసా ఎక్కువ తీసుకునే వాడు కాదు మా నాయిన. అదట్ట పోనిచ్చి ఒక్కసారి రిపేరు చేసొచ్చినాక మళ్లీ రిపేర్లకని రైతులు వస్తే 'యిట్టిట్టా చెయ్యి. ఆడ గ్రీజు వూయ్యి. ఈడ బోల్టు మార్చు' అంటా కాయితం మీద బొమ్మ గీసిచ్చి మందల (పని వివరం) చెప్పి పంపించేవాడు. మా నాయిన చెప్పినట్టు చేయంగానే వాళ్లకు నీళ్లొచ్చేవి.

అందుకని రైతులకి మా నాయినంటేనే బలే గురి. సచ్చి గీపెట్టినా యింకో కరెంటు పనోడి కాడికి పొయ్యేవోళ్లు కాదు.

యిదంతా చూసి మా అమ్మకు కడుపు కాలిపోతా ఉండేది.

'యీ మనిషి యిట్టా తిక్కలుగా ఉండబట్టి గదా మనం ఒక్క మిద్దే కట్ట గలిగింది. సరిగ్గా సంపా యిచ్చుంటే మూడు మిద్దెలు కట్టుండేవాళ్లం గదా' అనేది.

ఆ మాటకి సిగరెట్టు పొగతో పాటు ముసి ముసిగా నవ్వతా వుండేవాడు మా నాయిన.

కరెంటు పనోళ్లకు యిండ్ల వైరింగులోనే బలే డబ్బు లొస్తాయి. వైరింగుకు కావలసిన సామాన్లని కొని పించేటప్పుడే అవసరానికి మించి ఎక్కువ సామాన్లు కొనిపిస్తారు కొంతమంది కరెంటు పనోళ్లు. వాడేటివి వాడి తక్కినవన్నీ రహస్యంగా అమ్మక మూకేస్తారు. (అంటే నాలుగు వైరు కాయిల్స్ కావాల్సి ఉంటే ఆరు కొనిపిస్తారు మనచేత. వాడేది నాలుగు. అమ్ముకునేయి రెండు). మానాయిన మాత్రం

యింటి ప్లాను చూసి, ఈ యింటికి యిన్ని సామాన్లు అవసరమవతాయి అని లిస్టు చెబితే ఆ లిస్టే ఫైనలు. ఒక్క సామాను ఎక్కువయ్యేది కాదు. ఒక్క సామాను తక్కువయ్యేది కాదు.

మా నాయిన రాసిన లిస్టును చూసి అశోకా ఎలక్ట్రికల్స్ సుబ్రమణ్యం (కరెంటు సామాన్ల అంగ డాయన) తల పట్టుకునేవాడు.

'నాలుగు సామాన్లు ఎక్కువ రాయ్ కరీం భాయ్. కమీషనన్నా వస్తది కదా' అనేవాడు. దానికి మా నాయిన 'యీసారి రాస్తాలే' అని నవ్వేవాడేగాని రాసేవాడు కాదు.

అట్టాంటిడి- మా అన్న చదువు మానేసి మా నాయినకాడ పనిలో చేరినాక ఎవరు చెడగొట్టినారో ఏమో గానీ ఒకరోజు మేము వైరింగు చేస్తా వున్న యింట్లో నుంచి ఒక వైరు కాయిల్ ఎత్తకొచ్చేసినాడు రహస్యంగా.

మా నాయిన గమనించలా.

యింటికొచ్చినాక చూసి ఒణికిపోయినాడు. అదే వైరుని విప్పి మా అన్నను తన్నినాడు చూడూ- వాడి వంటిమీద వాతలు తేలిపోయినాయి.

'నువు యిప్పడే యిట్టా చేస్తే రేపు నీకు పనెవరు యిస్తార్రా లమిడీ కొడకా? నమ్మకం పోయినాక పనోడు బతికినా ఒకటే. సచ్చినా ఒకటేరా' అని, మనిషి ఎర్రంగయిపోయి కళ్లల్లో నీళ్లు తెచ్చేసుకు న్నాడు మా నాయిన.

అంతే. ఆ బయం అట్నే కూచుండి పోయింది మా అన్న మనసులో. మళ్లీ వాడు ఎక్కడా పూచిక పుల్ల తాకలా.

మా ఇస్కూలు వదిలినాక ఒక్కోరోజు వెళ్లి మా అంగడి కాడ కూచూనే వాణ్ణి నేను. మా అన్న లాగా పనికి తిరుక్కోకుండా శుద్ధంగా చదువుకుంటా



వుండావని బలే మర్యాదగా చూసేవాళ్లు నన్ను, మా అంగడికాడ.

ఒకరోజు యిట్టాగే కూచోనుంటే బర్త చనిపోయిన ముసలిశెట్టెమ్మొకామె వచ్చింది మా అంగడి కాడికి. మా అంగట్లోకి అట్టా ఇట్టా చూస్తా 'నాయినా! ఒక్క సీరియల్ సెట్టుకి బాడిగ ఎంత?' అని అడిగింది మా నాయిన్ని.

'రోజుకు రెండు రూపాయిలు' అన్నాడు మా నాయిన.

'టేబు లైటుకి?'

'నాలుగు రూపాయలు'

అప్పుడా శెట్టెమ్మ ఒకటికి నాలుగు సార్లు వేళ్లుమ డిచి లెక్కలేసుకొని 'నాయినా! రేపు మా యింట్లో రెండు సీరియల్ సెట్లు, రెండు ట్యూబ్ లైట్లు వెయ్యివా' అనింది.

ఆ లెక్కకి మా నాయిన నవ్వినాడు.

'అబ్బో! పెద్ద డెకరేషనే. ఏంది కతా శెట్టెమ్మా!' అన్నాడు నవ్వతానే.

'నా కూతురి పెళ్లి నాయిన. తంటాలు పడి ఎట్నో చేస్తా ఉన్నా. నా కూతురు బాదపడద్దనిగానీ లాకుంటే యీ లైటింగు కూడా చేయించలేను నాయినా' అనిందామె, నిజం చెప్తేస్తా.

మా నాయిన బలే కరిగిపోయినాడు.

'అంగడిలో పడుండే లైట్లు మీయింటికేస్తే నాకేమీ నష్టం లేదుగానీ యింకేమి చెప్పబళ్లేదు పో. ఆరు సీరియల్ సెట్లు, ఆరు టేబులైట్లు ఊరకనే ఏస్తా నుపో' అంటా మాటిచ్చినాడు. అన్నమాట ప్రకారమే పోయి ఏసొచ్చినాడు.

యిట్టా చేస్తా వుంటాడు కాబట్టే మా నాయిన కాడ పని నేర్చుకున్న పిలకాయల్లో కొంతమంది స్కూటర్ల మీద తిరగతా వున్నా మానాయిన మాత్రం అట్లాను సైకిలెక్కి తిరగతా వుంటాడు పనులకి.

మద్దూరుపాడుకు కూడా సైకిలు తొక్కునే వెళ్లే మా నాయిన బాద చూసి 'ఎట్నోకట్ట చేసి లూనాయో బూనాయో కొనుక్కోరాదా?' అని మా అమ్మ అంటే 'యిప్పుడు అదొక్కటే తక్కువ మనకి' అనేవాడు మా నాయిన.

మా ఊళ్లో రేడియోలు రిపేరు చేసే సీనియర్ సాయిబొకాయన యానాదోళ్లు రిపేరుకు తెచ్చిచ్చే రేడియోల్లో సామాన్లు నూకేసి, యాభై రూపాయిల రేడియో నూటేభైకి అమ్మేసి వేలు సంపాదించేసినాడు తొందరగా. ఆయనకాడికి రేడియోపోతే పర్వేటాస్ప త్రికి రోగి పోయినట్టేనని అందరూ అనుకుంటా వున్నా రిపేర్లకు మాత్రం గిరాకీ తగ్గేదికాదు.

ఆ మనిషి మా నాయిన సంపాధించే తీరు చూసి మనసుండబట్టలాక ఒకరోజు బలే సలహా ఇచ్చినాడు.

"కరీంభాయ్! మనం చేసేది ఎలక్ట్రికల్ పని. అసలు 'ఎలక్ట్రిక్' అనే పేరులోనే 'ట్రిక్' ఉండాది. మనం ట్రిక్ చేసే డబ్బులు సంపాదించాలా. సత్తె కాలానికి పోతే బతకలేము" అన్నాడు.

ఆ మాటలకి నవ్వి యింటికొచ్చి సంగతి చెప్పినాడు మా నాయిన. మంచి సలహానేగదా యీ తిక్కల మనిషి నవ్వతా వున్నాడేంది అనుకున్నాం యింట్లో.

కొన్ని రోజులకి ట్రిక్కులు చేస్తా డబ్బులు సంపా దించిన సాయిబు చనిపోయినాడు. ఆ వార్త విని 'పోయినాడు దొంగ నా కొడుకు' అనుకున్నారు మా ఊర్లో.

అప్పుడర్థమైంది మాకు మా నాయిన 'ట్రిక్కు' ఎందుకు నేర్వలేదో, మా నాయిన దారినపోతా వుంటే అందరూ మరేదగా 'కరీంభాయ్' అంటా ఎందుకు సలాము చేస్తా వుంటారో.

–మహమ్మద్ ఖదీర్‌బాబు